సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ, జనవరి 17 : వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 41 మందికి శుక్రవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.13.36 లక్షల విలువైన చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక గొప్ప వరం లాంటిదన్నారు. దీని వల్ల కొంత ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

చిన్ననాయక్ మృతి బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, జనవరి 17 : మండలంలోని కొర్రోనితండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొర్ర చిన్ననాయక్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. చిన్నా నాయక్ మృతదేహాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, చిన్నా నాయక్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం చింతకుంట్ల గ్రామానికి చెందిన కంచం ఇద్దయ్య ఇటీవల అనారోగ్యానికి గురి కాగా ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, తులసీరాం నాయక్, కొర్ర బీమానాయక్, హరికృష్ణ, వెంకటేశ్, పంగ లాలయ్య, యాదయ్య, రాధాకృష్ణ, వెంకులు పాల్గొన్నారు.

భీమ్‌రెడ్డికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాళి



భీమ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి (సాగర్), జనవరి 17 : మండలంలోని బోయగూడెం మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి తండ్రి భీమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎంసీ.కోటిరెడ్డి శుక్రవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లిపెద్ది రాజుయాదవ్, రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు కూన్‌రెడ్డి లింగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మాలె సత్యంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శివశంకర్, ఆవుల శ్రీనివాస్, సైదిరెడ్డి, బోయ వెంకట్‌రెడ్డి, నెమలి వెంకట్‌రెడ్డి, పొదిల మల్లయ్య, జలేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే బీఎల్ఆర్

పాములపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మాడ్గులపల్లి, జనవరి 17 : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగ మోత్కూర్, గుర్రప్పగూడెం, భీమనపల్లి, కల్వలపాలెం, బొమ్మకల్, సీత్యాతండా, తోపుచర్ల, ఇసుకబావి గూడెం, గండ్రవానిగూడెం, కుక్కడం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి మన ఊరు–మన ఎమ్మెల్యే, ఆరు గ్యారెంటీల పథకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : వెంకటేశం

వెలిమినేడులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిట్యాల, జనవరి 17 : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం అన్నారు. మండలంలోని వెలిమినేడు గ్రామంలో డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ మారగోని యాదయ్య, సత్తిరెడ్డి, శ్రీశైలం, డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఖాజాపాషా, గోలి గణేశ్, సత్యనారాయణ, నర్సింహ, వెంకటేశం, లింగస్వామి పాల్గొన్నారు.

ఈనెల 19న ఉచిత కంటి వైద్య శిబిరం

మునుగోడు : మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల ప్రజలు జనవరి 19న మునుగోడు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయ ఆవరణలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, శంకర్ కంటి ఆస్పత్రి ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టుదలతో కృషి చేస్తేనే విజయం : జగదీశ్వర్

విజేతకు బహుమతి అందిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ యాదవ్

మర్రిగూడ, జనవరి 17 : క్రమశిక్షణ, పట్టుదలతో కృషిచేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్ అన్నారు. మండలంలోని యరగండ్లపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముత్యాలమ్మ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు వల్లంల సంతోష్ యాదవ్ వైపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. దీనికి సంబంధించి శుక్రవారం ఫైనల్ మ్యాచ్ ముగియడంతో విజేతలకు ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10 వేలతో పాటు ట్రోఫీలను ఆయన అందించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అదే విధంగా గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులను సంతోష్ యాదవ్ సన్మానించి మెమెంటోలు అందించారు. రిటైర్డ్ హెచ్ఎం కుక్కడపు యాదయ్య, డా.రమణ, నాయకులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం : వేణుకుమార్

మునుగోడు, జనవరి 17 : స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీసీలు గెలిచే విధంగా పనిచేయాలని ఓబీసీ జాక్ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణుకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ, కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

రామగిరి, జనవరి 17 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) – జనవరి 2025 పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిసినట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం తెలిపారు. కాగా చివరి రోజు డ్రాయింగ్ లోయర్, హైయ్యర్ పరీక్షలు నిర్వహించారు. 714 మందికి గాను 505 మంది హాజరు కాగా 209 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామ సభల ద్వారా అర్హులను ఎంపిక చేయాలి

- జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్

మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్, పక్కన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జనవరి 17 : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించి అర్హులనే ఎంపిక చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నాలుగు పథకాలకు సంబంధించిన విధి విధానాలు గ్రామాల్లో ప్రజలకు వివరించి అనర్హులను గుర్తించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో ఎక్కువ మంది లబ్ధిదారులు ఆయా పథకాలు కవాలని డిమాండ్ చేస్తున్నారని, అయితే మొదటి విడుతలో కొంతమందిని మాత్రమే ఎంపిక చేయాల్సి ఉండగా వారిలో అత్యంత అర్హులు ఎవరో తేల్చాలన్నారు. పథకాల అమలుపై జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేపై ఆమె అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా సర్వేకు జిల్లాలో 140 బృందాలను ఏర్పాటు చేసి 16వ తేదీ నుంచి క్షేత్రస్థాయి పరిశీలన చేసి 138 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు అర్హుల డేటాను నమోదు చేస్తున్నామని, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు కూడా 70శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఆత్మీయ భరోసాలో రాష్ట్రస్థాయి నుంచి వచ్చే జాబితాకు ఆధార్, జాబ్‌కార్డు అనుసంధానం చేసి లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాను 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వివరించి ఆమోదం పొందిన తర్వాతే అనుమతులు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'

నల్లగొండ సిటీ : కనగల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అనితా రామచంద్రన్ తనిఖీ చేశారు. అర్హుల పేర్లను అక్కడిక్కడే నిర్ధారించాలని సర్వేయర్లకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో జిల్లాకు సంబంధించిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ జయరామ్, ఎంపీఓ సుమలత ఉన్నారు.

అనర్హులను జాబితాలో చేర్చొద్దు : కలెక్టర్

కొండమల్లేపల్లి : ప్రభుత్వ పథకాల కోసం అర్హులను గుర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికలో శుక్రవారం అధికారులకు దిశానిర్దేశం చేసి సర్వేను పరిశీలించారు. అనర్హులను లబ్ధిదారుల జాబితాలో చేర్చొద్దని, అలా చేరిస్తే పూర్తి బాధ్యత అధికారులదేనన్నారు. భూ భారతి(ధరణి)లో డేటాను సేకరించి విలేజ్ మ్యాప్, గ్రామపంచాయతీల లేఅవుట్, రెవెన్యూ భూసేకరణ రికార్డుల డేటాతో సరిపోల్చుకొని రైతు భరోసా కోసం సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. రైతు భరోసా పథకంలో ఒక్క రైతుకు కూడా నష్టం చేయొద్దన్నారు. లబ్ధిదారుల తుది జాబితాను ఈ నెల 25లోగా పూర్తి చేయాలని అదేశించారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డీఓ రమాణారెడ్డి, ఎంపీడీఓ బాలరాజరెడ్డి తదితరులున్నారు.

దేవరకొండ ఏరియా దవాఖానలో ఓపీ రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

చందంపేట(దేవరకొండ) : దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని శు క్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని మాతా శిశు సంరక్షణ విభా గం, క్యాజువాలిటీ, డయాలసిస్ విభాగాలను తనిఖీ చేసి సౌకర్యా లు, రోగుల వివరాలను సూపరింటెండెంట్ బి.మంగ్యానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఐపీ, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఓపీ రోగులతో మాట్లాడి వైద్య సేవల గరించి ఆరా తీశారు. రాత్రి సమయంలో కొంత మంది మద్యం తాగి ఆస్పత్రికి వస్తున్నారని, పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను దవాఖాన సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై పోలీస్ అధికారులతో మాట్లాడి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. దవాఖానలో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని తాటికోల్ రోడ్డులో రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఆర్డీఓ రమణారెడ్డి, తాసీల్దార్ సంతోశ్ కిరణ్ ఉన్నారు.

నల్లగొండను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలి

- కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ, జనవరి 17 : నల్లగొండను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆమె ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు విక్రయించే వారిని, అమ్మేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీటి నిర్మూలనకు ఇప్పటికే మిషన్ పరివర్తన్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ మరోసారి విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించరు. ఎక్కడైనా గంజాయి పండిస్తే గుర్తించాలని, రైతులు పండిస్తే మాత్రం రైతు భరోసా నిలిపి వేస్తామని హెచ్చరించారు. పోలీసులు దీని నియంత్రణకు నిఘా పెంచాలని సూచించారు. చిట్యాలలో లాగా నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓకు సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా మిషన్ పరివర్తన్ కింద అనేక కార్యక్రమాలు నిర్వహించామని, గంజాయి, డ్రగ్స్ లాంటివి ఎవరు తీసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నార్కోటిక్స్ హైదరాబాద్ కేంద్రం డీఎస్పీ భిక్షపతిరావు, ఆర్డీఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్ : ఆర్లగడ్డగూడెంలో రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న ఏసీ శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నకిరేకల్, జనవరి 17 : రైతు భరోసా భూ సర్వేలో సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని ఆర్లగడ్డగూడెంలో నిర్వహిస్తున్న భూ సర్వేను ఆర్డీఓ అశోక్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ యోగ్యం లో ఉన్న భూములు, రైతుల వారీగా చేస్తున్న జాబితాను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఉన్న పంట పొలాలు రైతు భరోసా ద్వారా ఆర్థిక పెట్టుబడి కోసం లబ్ధి చేకూర్చేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగులో ఉన్న, సాగుకు యోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, సీనియర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, బీటీఎం విక్రమ్, సందీప్ ఉన్నారు.

కేతేపల్లి : మండల పరిధిలోని కొర్లపహాడ్ గ్రామంలో జరుగుతున్న వ్యవసాయ భూముల క్షేత్రస్థాయి భూ సర్వేను రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిప్పర్తి : మండలంలోని కేశరాజుపల్లిలో నిర్వమిస్తున్న రైతుభరోసా సర్వేను జిల్లా వ్యవసాయాధికారి పి. శ్రవణ్‌కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు : డీపీఎస్ఓ వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

శాలిగౌరారం, జనవరి 17 : అర్హులందరికీ రేషన్ కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు పారదర్శకంగా సర్వే చేసిన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తాసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ సుధాకర్, మండల ప్రత్యేకాధికారి మన్యానాయక్, సూపరింటెండెంట్ సుందరయ్య, ఎంపీఓ పద్మ ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న తాసీల్దార్ దశరథ

చండూరు, జనవరి 17 : మండల తాసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణలక్ష్మి చెక్కులను తాసీల్దార్ దశరథ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా బీసీలకు 113, ఎస్టీ 02, మైనారిటీ 4 మొత్తం 119 మందికి చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. ఎస్సీలకు సాంకేతిక సమస్య కారణంగా చెక్కులు నిలిచి పోయాయని త్వరలో వారికి కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ నిర్మలాదేవి, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీ అండ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ

ఫిజికల్ డైరెక్టర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

రామగిరి, జనవరి 17 : ఫిజికల్ డైరెక్టర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని పీఆర్టీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్శవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా బొమ్మపాల గిరిబాబు, అధ్యక్షుడిగా ఇమామ్ కరీం, ప్రధాన కార్యదర్శిగా నారాయణ కవిత, కోశాధికారిగా ఎం.బాలరాజుయాదవ్, ఉపాధ్యక్షులు కేతావత్ శ్రీనివాస్, ఎండీ అజీజ్, జాయింట్ కార్యదర్శిగా ఎ.రవీందర్‌రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, కార్యవర్గ సభ్యులుగా ఈద సరితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి హర్శవర్ధన్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు.

నల్లగొండకు చేరిన సహజ యోగా ప్రచార రథం

నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న సహజ యోగా సభ్యులు

నల్లగొండ రూరల్/రామగిరి, జనవరి 17 : సులభ, శక్తివంతమైన ధ్యాన విధానమే సహజ యోగా అని ట్రస్టు తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ అన్నారు. సహజ యోగా ప్రచార రథం శుక్రవారం నల్లగొండ పట్టణానికి చేరుకున్న సందర్భంగా పట్టణంలోని ఆర్జాలబావిలో ధ్యాన విధానాన్ని మాతాజీ నిర్మలాదేవి ఇంటింటికీ తిరిగి వివరించారు. అదే విధంగా పట్టణంలోని యాటకన్నారెడ్డి కాలనీ నుంచి గడియారం సెంటర్ వరకు ర్యాలీ చేసి యోగ విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామ్మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వినయ్ కుమార్, మంగారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్లు కృష్ణ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

చిట్యాల, జనవరి 17 : మండలంలోని వెలిమినేడు గ్రామంలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బొంగోనిచెర్వు గామానికి చెందిన వై.వెంకట్‌రెడ్డి(54) గత పదేండ్లుగా గుండ్రాంపల్లి గ్రామ శివారులోని దొడ్ల పాల డెయిరీ ఫ్యాక్టరీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం శుక్రవారం ట్రాక్టర్‌పై చిట్యాలకు బయల్దేరాడు. మార్గమధ్యంలో వెలిమినేడు గ్రామ శివారులోకి రాగానే హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ పల్టీ కొట్టగా వెంకట్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మ తెలిపారు.

రాములు కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

శాలిగౌరారం, జనవరి 17 : మండల పరిధిలోని వంగమర్తి గ్రామానికి చెందిన ఉడుగు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం రాములు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పాదూరి శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సమరంరెడ్డి, సుధాకర్, వీరభద్రం, గోపి ఉన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నీలగిరి, జనవరి 17 : విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వర్రె ప్రదీప్ శుక్రవారం ఎన్జీ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన కొత్త ఆంజనేయులు రెడ్ సిగ్నల్ పడినా కూడా ఆగకుండా వెళ్తున్నాడు. కానిస్టేబుల్ ప్రదీప్ అతడిని ఆపి అందరు ఆగినప్పుడు సిగ్నల్ క్రాస్ చేయడం సరికాదని నిలదీశాడు. దీనికి ఆంజనేయులు వారికి పనిలేదని అంటూ వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో కానిస్టేబుల్ బండి నంబర్‌ను ఫొటో తీస్తుండగా ఆంజేయులు గమనించి వెనక్కి వచ్చి కానిస్టేబుల్‌తో గొడవకు దిగాడు. నా ఫొటోనే తీస్తావా? అంటూ తనపై దాడికి దిగాడని కానిస్టేబుల్ ప్రదీప్ ఆరోపిస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యాదయ్యకు సీపీఎం నాయకుల నివాళి

చిట్యాల, జనవరి 17 : మండలంలోని నేరడ గ్రామానికి చెందిన ప్రజానాట్య మండలి కళాకారుడు మందుగుల యాదయ్య మృతి పట్ల సీపీఎం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. యాదయ్య మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

నార్కట్‌పల్లి జనవరి 17 : మండలంలోని చెర్వుగట్టు గుట్టపై శుక్రవారం మతిస్థిమితం లేని గుర్తు తెలియని మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. చెర్వుగట్టు గుట్టపై మార్గమధ్యంలో శివుడి విగ్రహం వద్ద షెడ్డు పక్కన గల చెట్టుకు గుర్తు తెలియని, సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ ఉరి వేసుకొని మృతి చెందినది. అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. సీనియర్ అసిస్టెంట్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మరిన్ని సేవలు

- టీజీబీ చైర్మన్ శోభ

మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న టీజీబీ చైర్మన్ శోభ

నల్లగొండ, జనవరి 17 : రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుగా ఉన్న శాఖలన్నీ ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా చలామణిలోకి వచ్చాయని, రానున్న రోజుల్లో కస్టమర్లకు విస్తృతమైన సేవలు అందించనున్నామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై. శోభ అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రాంతీయ కార్యాలయంతోపాటు అసెట్ మేనేజ్‌మెంట్ హబ్, ఎల్‌సీపీసీలను ఆమె శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ విలీనం తర్వాత 927 శాఖలతో రూ.70వేల కోట్లతో వ్యాపారం సాగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఎంబీ దేవేందర్, ఎస్ఎంఓ వెంకటేశ్, డీపీఎం రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్న యూత్ ఫర్ సేవ నిర్వాహకులు

రామగిరి, జనవరి 17 : జిల్లా కేంద్రంలో యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో సర్వీస్ నౌ కంపెనీ సహకారంతో మహిళలకు మూడు నెలలుగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శుక్రవారం ముగిసింది. ఇందులో భాగంగా తొలి విడుతలో శిక్షణ పూర్తి చేసుకున్న 27మంది మహిళలకు యూత్ ఫర్ సేవా తెలుగు రీజియన్ కోఆర్డినేటర్ సునీల్, అడ్వైజరీ బోర్డు సభ్యులు వెంకట్‌రెడ్డి కుట్టుమిషన్లు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణి, టైలర్ నాగమణి పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలి : సీపీఎం

డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద మౌలిక వసతులను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

రామగిరి, జనవరి 17 : పట్టణంలోని డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సాధన పోరాట కమిటీ కన్వీనర్ ఆవుల రవీందర్ డిమాండ్ చేశారు. ఇండ్లను శుక్రవారం వారు పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దంకి నర్సింహ, మధసూదన్‌రెడ్డి, బొడ్డుపల్లి సైదులు తదితరులున్నారు.

మాదిగల మహాగర్జనను విజయవంతం చేయాలి : సైదులు

చిట్యాలలో కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిట్యాల, జనవరి 17 : ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజి సైదులు అన్నారు. చిట్యాలలో సంఘం నాయకులతో కలిసి శుక్రవారం మహాగర్జన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియామకాలు చేయకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోములు, యాదగిరి, రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీ సీఎస్‌ను కలిసిన డ్వాబ్ బృందం

నల్లగొండ రూరల్, జనవరి 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కావేటి విజయనంద్‌ను డ్వాబ్ బృందం శుక్రవారం విజయవాడలో కలిసి శుభాకంక్షలు తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల హక్కుల చట్టం –2016 ప్రకారం దివ్యాంగులకు రాష్ట్ర స్వతంత్ర కమిషన్‌ను నియమించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును మెమోరాండంగా అందించారు. అనంతరం విజయనంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కరావు, కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్ ఉన్నారు.